RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి -13 సంచిక - 410 | 25 గురువారం జూన్ 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

## 'ఎస్ఐఆర్'పై సీఎం రేవంత్ ఫోకస్..

# నేతలకు స్ట్రాంగ్ వార్నింగ్!

- ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ నేతలకు సీఎం రేవంత్ హెచ్చరిక
- నిర్లక్ష్యం చేస్తే ఇన్‌చార్జిల మార్పు తప్పదని స్పష్టం
- పది రోజుల పాటు నేతల పనితీరుపై నిఘా
- గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచన
- పేదల ఓటు హక్కులను కాపాడాలని పిలుపు



ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ అత్యంత కీలక అంశంగా పరిగణిస్తోంది. ఈ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించే నేతలపై కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైతే నియోజకవర్గ ఇన్‌చార్జిలను మార్చేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. బుధవారం పార్టీ నేతలతో నిర్వహించిన జూమ్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి ఎస్ఐఆర్‌పై విస్తృతంగా చర్చించారు. ఓటరు జాబితాల నుంచి నిజమైన ఓటర్ల పేర్లు తొలగించే అవకాశం ఉందన్న నివేదికల నేపథ్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వచ్చే పది రోజుల పాటు నేతల పనితీరును పరిశీలిస్తామని, అలసత్వాన్ని ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు.

గ్రామీణ స్థాయిలో అవగాహన పెంచడంలో సర్పంచ్‌లు కూడా చురుగ్గా వ్యవహరించాలని సీఎం పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ అంశం చాలా సున్నితమైనదని, కొందరు నాయకులు దీన్ని తేలిగ్గా తీసుకుంటున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికే జిల్లా వారీగా నివేదికలు తనకు అందాయని, పార్టీకి నష్టం కలిగే పరిస్థితులను చూస్తూ ఊరుకోబోనని హెచ్చరించారు. ప్రతి నియోజకవర్గంలో మరిన్ని అవగాహన సమావేశాలు నిర్వహించాలని సీఎం ఆదేశించారు. ఈ కార్యక్రమాల విజయవంతమైన నిర్వహణ బాధ్యతలను ఇన్‌చార్జి మంత్రులకు అప్పగించారు. ముఖ్యంగా పేదల ఓటు హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఓటు కోల్పోతే ఇతర ప్రభుత్వ పథకాలపై కూడా ప్రభావం పడే ప్రమాదం ఉందని అన్నారు. రాష్ట్రంలో ఎన్నికల సంఘం గురువారం నుంచి ఇంటింటి ఓటరు ధ్రువీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. జూన్ 25 నుంచి జులై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించనున్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలన్నీ తమ తమ కార్యాచరణను ముమ్మరం చేస్తున్నాయి.

## గ్రామాల రూపురేఖల్లో

# మార్పేది?

### : మంత్రి సీతక్క



రాష్ట్రంలోని గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలో సుమారు 1.35 లక్షల మంది సిబ్బంది పనిచేస్తున్నారు.. ఏటా రూ.34 వేల కోట్లకు పైగా నిధులు ఖర్చవుతున్నాయి.. భారీ యంత్రాంగం, నిధులు ఉన్నప్పటికీ గ్రామాల రూపురేఖలు ఆశించిన స్థాయిలో ఎందుకు మారడం లేదు? అని మంత్రి సీతక్క అధికారులను ప్రశ్నించారు. ప్రజా ప్రభుత్వం పల్లెల ప్రగతికి వేల కోట్లు వెచ్చిస్తున్నా ఫలితమెందుకు రావడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. గ్రామాల అభివృద్ధి అంటే కేవలం భవనాలు, రోడ్లు నిర్మించడం మాత్రమే కాదని, గ్రామాల్లో నివసించే ప్రతి కుటుంబ జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే అసలు అభివృద్ధి అని తెలిపారు. మంగళవారం ప్రజాభవన్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు, జెడ్పీ సీఈవోలు, డీఆర్డీవోలు, డీపీవోలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, మిషన్ భగీరథ, సెర్ప్, ఉపాధి హామీ పథకం తదితర విభాగాల అధికారులతో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల రాష్ట్రస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ దానకిశోర్, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్యాదేవరాజన్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో ఈ నెలాఖరు వరకు విస్తారంగా భారీ వర్షాలు



ఎండలు, ఉక్కపోతలతో ఇబ్బంది పడుతున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తీపి కబురు అందించింది. రాబోయే వారం రోజుల పాటు (జూన్ 30 వరకు) రెండు రాష్ట్రాలలోనూ నైరుతి రుతుపవనాల ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తాయని అమరావతి, హైదరాబాద్ వాతావరణ కేంద్రాలు వెల్లడించాయి. ఈ కాలంలో అనేక ప్రాంతాలలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉండగా.. కొన్ని జిల్లాలలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు, గంటకు 30 నుండి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ విస్తారమైన వర్షాల కారణంగా రాబోయే రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 2 నుండి 5 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే.. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయ గోదావరి జిల్లాలతో కూడిన ఉత్తర కోస్తా ప్రాంతాలలో నేడు (24న) అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. 29, 30 తేదీలలో ఇక్కడ వర్షాల తీవ్రత మరింత పెరగొచ్చని అంచనా వేస్తున్నారు. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు వంటి దక్షిణ కోస్తా జిల్లాలలో ప్రారంభంలో మోస్తరు వర్షాలు ఉండి, జూన్ 28 నుండి 30 మధ్య విస్తారంగా భారీ వర్షాలు కురిసే వీలుంది. రాయలసీమ ప్రాంతంలో ఆరంభంలో తక్కువగా ఉన్నప్పటికీ, వారం చివర్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. తెలంగాణలో నేడు (24న) ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, నల్గొండ సహా ఎనిమిది జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయంటూ ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వారం చివరి నాటికి హైదరాబాద్, రంగారెడ్డితో పాటు దక్షిణ జిల్లాలకు కూడా ఈ వర్షాలు విస్తరించనున్నాయి.

# తెలంగాణలో హిట్లర్ పాలన


## : ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం హిట్లర్ తరహా పాలన సాగిస్తోందని, ఖమ్మం జిల్లాలో పేదల ఇళ్లను కూల్చివేస్తూ దమనకాండకు పాల్పడుతోందని బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి టి. హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేదలకు రక్షణగా నిలవాల్సింది పోయి, ల్యాండ్ గ్రాబర్‌గా వ్యవహరిస్తున్నారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. రఘునాథపాలెంలో ఇళ్ల స్థలాల నిర్వాసితులతో నిర్వహించిన సమావేశంలో హరీశ్ రావు మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రఘునాథపాలెం పరిధిలోని సర్వే నంబర్ 218లో 625 నిరుపేద కుటుంబాలకు ఇళ్ల పట్టాలు అందజేసి, గృహలక్ష్మి పథకం కింద లబ్ధి చేకూర్చామని ఆయన గుర్తుచేశారు. నిరుపేదలు అప్పులు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపడితే, ప్రస్తుత ప్రభుత్వం జేసీబీలతో వాటిని కూల్చివేయడం అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 30న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన చింతకాని మండలంలో నిర్వహించనున్న 'రైతు ఆశీర్వాద సభ'ను 'రైతుల క్షమాపణ సభ'గా మార్చుకోవాలని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. రైతుబంధు చెల్లింపులు, రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్ల అంశాల్లో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఆయన తప్పుబట్టారు. భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఖమ్మం జిల్లా కలెక్టర్‌కు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, పలువురు ఎమ్మెల్సీలు, ఇతర బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు. గత కొంతకాలంగా రెవెన్యూ మంత్రికి వ్యతిరేకంగా భూ, మైనింగ్ సమస్యలపై బీఆర్ఎస్ నేతలు విమర్శలు గుప్పిస్తున్న నేపథ్యంలో హరీశ్ రావు చేసిన తాజా వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## బీఆర్ఎస్ నేత బాల్క సుమన్‌కు హైకోర్టులో ఊరట..

### షరతులతో బెయిల్



బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. సింగరేణి అధికారులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారన్న కేసులో ఆయనకు బుధవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది. ఇద్దరు వ్యక్తుల పూచీకత్తును సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ తీర్పుతో గత కొంతకాలంగా రిమాండ్‌లో ఉన్న సుమన్‌కు ఊరట లభించినట్లయింది. కేసు నేపథ్యం పరిశీలిస్తే, గత మే 26న జరిగిన పార్టీ సమావేశంలో బాల్క సుమన్, నాంపల్లిలోని సింగరేణి భవన్, మందమర్రిలోని జనరల్ మేనేజర్ కార్యాలయ అధికారులను లక్ష్యంగా చేసుకుని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు అశాంతిని రేకెత్తించేలా ఉన్నాయని పేర్కొంటూ సింగరేణి అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు, మే 30న తెలంగాణ భవన్‌లో సుమన్‌ను అరెస్ట్ చేశారు. అనంతరం న్యాయస్థానం ఆయనకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జైలులో సుమన్‌ను పరామర్శించి, అధికార కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై విమర్శలు గుప్పించారు.

# కేంద్ర మంత్రులతో తుమ్మల, ఉత్తమ్ భేటీ



రాష్ట్రంలో నెలకొన్న యూరియా, ధాన్యం కొనుగోళ్ల సమస్యలను పరిష్కరించాలని మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఢిల్లీలో ఆహార ప్రజాపంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు సమస్యలను కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. మిషన్ ఆయిల్‌పామ్ లక్ష్యాన్ని తెలంగాణ సమర్థవంతంగా అమలుచేస్తున్నదని మంత్రి తుమ్మల వివరించారు. రాష్ట్రంలో ఇప్పటికే సుమారు 3 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు విస్తరించగా, 70 వేల మందికిపైగా రైతులు ఈ పంటను సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఆయిల్‌పామ్ రైతులకు కనీస గ్యారెంటీ ధర విధానాన్ని అమలుచేసే అంశాన్ని కేంద్రం పరిశీలించాలని కోరారు.

ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని పెంచాలి : మంత్రి ఉత్తమ్‌రాష్ట్రంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు రికార్డు స్థాయిలో జరిగిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన సేకరణ లక్ష్యాన్ని పెంచాలని, అదే విధంగా కస్టమ్ మిల్డ్ రైస్ (సీఎంఆర్) సరఫరా గడువు పొడిగించాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. దేశంలోనే అత్యధికంగా తెలంగాణ ప్రభుత్వం ఇప్పటివరకు 80.09 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించిందని, కొనుగోలు ప్రక్రియ ఇంకా కొనసాగుతున్నదని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 80.09 లక్షల టన్నుల ధాన్యం సేకరించగా, కేంద్రం 51.47 లక్షల టన్నుల ధాన్యానికి మాత్రమే అనుమతిచ్చినట్టు తెలిపారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in

# కంప్యూటర్ సాఫ్ట్ వేర్ కోర్సుల్లో ఆన్ లైన్ ద్వారా ఉచిత శిక్షణ

హైదరాబాద్, జూన్ 24: స్వర్ణ తెలంగాణ స్వయం ఉపాధి శిక్షణ పథకం ద్వారా 36వేల మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితంగా 100కు పైగా వివిధ కంప్యూటర్ సాఫ్ట్ వేర్ కోర్సుల్లో ఆన్ లైన్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఏ. వెంకట్ రెడ్డి తెలిపారు. ఆన్ లైన్ ఈ లెర్నింగ్ ద్వారా కోర్స్ పూర్తిచేసిన యువతకు కేంద్ర ప్రభుత్వం ఆమోదంచే నేషనల్ స్కిల్ అకాడమీ ద్వారా సర్టిఫికెట్ అందజేయడం జరుగుతుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తిగల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నేటి సమాజంలో పేద, మధ్యతరగతి విద్యార్థిని విదార్థులకు, నిరుద్యోగ యువతీ యువకులకు అత్యధిక జీత భత్యాలు, ఉద్యోగ అవకాశాలు గల కంప్యూటర్ సాఫ్ట్వేర్ రంగంలో ఆన్లైన్ శిక్షణ అందించడం ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కంప్యూటర్ సాఫ్ట్వేర్ శిక్షణ రంగంలో 34 సంవత్సరాల అనుభవం గల పేస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సంస్థ నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా లేటెస్ట్ కంప్యూటర్ సాఫ్ట్వేర్ కోర్సుల్లో ఆన్లైన్ లో శిక్షణను అందించనున్నట్లు తెలిపారు. ఈ పథకం క్రింద ఏఐ, డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి 100 కోర్సులు ఎలాంటి కోర్స్ ఫీజు లేకుండా ఆన్ లైన్ ఈ-లెర్నింగ్ ద్వారా శిక్షణను అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు విదేశాలలో అధిక వేతనాలతో ఉత్తమ ఉపాధి అవకాశాలు ఉంటాయని తెలిపారు. స్వర్ణ తెలంగాణ స్వయం ఉపాధి శిక్షణా పథకం ద్వారా రూ.1,50,000 వరకు కోర్స్ ఫీజులు గల వివిధ లేటెస్ట్ కంప్యూటర్ సాఫ్ట్వేర్ డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సులు ఎలాంటి కోర్స్ ఫీజు లేకుండా నేర్చుకొని సాఫ్ట్వేర్ రంగంలో ఉద్యోగాలు పొందాలని ఆయన సూచించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ విద్యార్థినీ



విద్యార్థులు, నిరుద్యోగ యువతీ యువకులు జూలై 31వ తేదీ లోగా ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

దరఖాస్తు చేసుకునేందుకు వెబ్ సైట్: www.pacecomputers.org

వివరాలకు ఫోన్: 9505800047

# త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి అభినందన సత్కారం



హైదరాబాద్, జూన్ 24: త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనా రెడ్డి తన పర్యటనలో భాగంగా హైదరాబాద్ నగరానికి వచ్చిన సందర్భంగా బీజేపీ సీనియర్ నేత వై. కృష్ణ, బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్.లక్ష్మణ్ రావు ల నేతృత్వంలో పలువురు బీజేపీ నేతలు, కార్యకర్తలు బుధవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు జ్ఞాపికను బహుకరించారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా ప్రయోజన పథకాలు, సామాజిక అభివృద్ధి, తదితర అంశాలపై వారు గవర్నర్ తో చర్చించారు.

# మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై విస్తృత ప్రచారం నిర్వహించిన పహాడీషరీఫ్ పోలీసులు





హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జూన్ 24

అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం2026 సందర్భంగా పహాడీషరీఫ్ పోలీసులు గురువారం ప్రత్యేక డ్రగ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.పాత పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ నుంచి పహాడీషరీఫ్ కమాన్ వరకు చేపట్టిన ఈ ర్యాలీలో ప్రజలకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆర్జీఐఏ ఏసీపీ శ్రీకాంత్ గౌడ్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ,మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యం,కుటుంబాలు,సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు.డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే శారీరక,మానసిక,సామాజిక,చట్టపరమైన పరిణామాల గురించి వివరించారు.కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల దుష్పరిణామాలను వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు.యువత ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అవలంబించి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు.అలాగే డ్రగ్స్ విక్రయం,వినియోగం వంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.ఈ అవగాహన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించగా,సమాజాన్ని మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని పహాడీషరీఫ్ పోలీసులు తెలిపారు.ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్, షంషాబాద్ జోన్, హైదరాబాద్ సిటీ

# డీజీపీ సి.వి. ఆనంద్ ఐపీఎస్ కు టీఎన్జీవోస్ నేతల సత్కారం



హైదరాబాద్, జూన్ 24: తెలంగాణ రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన సి.వి. ఆనంద్ ఐపీఎస్ ను టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మారం జగదీశ్వర్, జనరల్ సెక్రటరీ ముజీబ్ హుస్సేనీ, అసోసియేట్ ప్రెసిడెంట్, బీటీఎన్జీవోస్ (గచ్చిబౌలి) హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు ముత్యాల సత్యనారాయణ గౌడ్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు సుమన్, తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి, ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు.

# వివాహ వేడుకలకు హాజరై వధూవరులను ఆశీర్వదించిన సబితా ఇంద్రారెడ్డి



హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జూన్ 24

మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే,మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి జిల్లాలోని పలు వివాహాది శుభకార్యాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా,ముఖ్యంగా మహేశ్వరం నియోజకవర్గంలో నిర్వహించిన వివాహ వేడుకల్లో పాల్గొన్న పి.సబితా ఇంద్రారెడ్డి,వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి దాంపత్య జీవితం ఆనందంగా,ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు,బంధుమిత్రులతో ఆప్యాయంగా ముచ్చటించిన సబితా ఇంద్రారెడ్డి,ప్రజల సంతోషాల్లో భాగస్వామ్యం కావడం తనకు ఆనందంగా ఉందన్నారు.వివాహ వేడుకలకు హాజరైన స్థానిక ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు,అభిమానులు పి.సబితా ఇంద్రారెడ్డికు ఘన స్వాగతం పలికారు.

# జర్నలిస్టు పేరుతో నకిలీల వల్ల పెరుగుతున్న ముప్పు..

# అసలైన పాత్రికేయుల గౌరవానికి పెను సవాల్.

సాంకేతికత అందుబాటులోకి వచ్చిన తర్వాత సమాచార ప్రసారం ఎంతో సులభమైంది. ఒక యూట్యూబ్ ఛానెల్ ప్రారంభించడం, చిన్న వెబ్సైట్ ఏర్పాటు చేయడం లేదా సోషల్ మీడియా వేదికను నిర్వహించడం పెద్ద విషయం కాదు. అయితే ఇదే పరిస్థితిని కొందరు దుర్వినియోగం చేస్తూ తమను తాము "జర్నలిస్టులు"గా ప్రచారం చేసుకుంటున్నారు.జర్నలిజం అనేది సమాజానికి బాధ్యతాయుతమైన వృత్తి. కానీ కొందరు వ్యక్తులు ఈ వృత్తి పేరును అడ్డం పెట్టుకుని అక్రమ ప్రయోజనాలు పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. తమ అసలు వృత్తులు కొనసాగిస్తూనే, పార్ట్టైమ్గా జర్నలిజం ముసుగులో అధికారులు, వ్యాపారులు, ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తీసుకురావడం, బెదిరింపులకు పాల్పడడం, అక్రమ వసూళ్లకు యత్నించడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని తరచూ ఆరోపణలు వినిపిస్తున్నాయి.



సీనియర్ జర్నలిస్టు అశోక్ గౌడ్ ఫోటో ఇది

ఇలాంటి వారి సంఖ్య పెరగడానికి ప్రధాన కారణం పటిష్టమైన నియంత్రణ వ్యవస్థ లేకపోవడమే. ఎవరు నిజమైన జర్నలిస్టులు? ఎవరు కేవలం జర్నలిస్టు పేరును వాడుకుంటున్నవారు? అనే అంశంపై స్పష్టత లేకపోవడం సమస్యను మరింత తీవ్రత ను పెన్చేస్తోంది.దీని ప్రభావం అత్యధికంగా నిజాయితీగా పనిచేస్తున్న పాత్రికేయులపై పడుతోంది. నకిలీ (జర్నలిస్టు)ల చర్యల కారణంగా ప్రజల్లో మొత్తం మీడియాపై అనుమానాలు పెరుగుతున్నాయి. ఫలితంగా కష్టపడి వార్తలను సేకరించే నిజమైన జర్నలిస్టుల విశ్వసనీయత, గౌరవం దెబ్బతింటోంది.మరోవైపు అనేక మంది మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు తక్కువ వేతనాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం, సంక్షేమ పథకాలు అందకపోవడం వంటి సమస్యలతో సతమతమవుతున్నారు. అయినప్పటికీ వారు ప్రజలకు వాస్తవాలను చేరవేయాలనే నిబద్ధతతో పనిచేస్తున్నారు.జర్నలిజం పవిత్రతను కాపాడాలంటే నకిలీ (జర్నలిస్టు)లపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, నిజమైన పాత్రికేయులకు తగిన గుర్తింపు, రక్షణ, సంక్షేమం కల్పించడం అత్యవసరం. సమాజానికి నిజం చెప్పే కలాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత..

(నాకో సమూహం నుండి వచ్చింది.)

# సాహితీ సమ్మేళనం బ్రోచర్ ఆవిష్కరణ....

సమాజ శ్రేయస్సే కర్తవ్యం గా సాహితీ రచనలు ఉండాలని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం సాహితీ స్రవంతి నిర్వహణ కమిటీ బాధ్యులు గుండు నారాయణరావు అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో పోస్టల్ యూనియన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జూలై 11, 12 తేదీల్లో విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో సాహిత్య సమ్మేళనం జరుగుతుందన్నారు. యువ రచయితలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యువ రచయితలను, కవులను, సాహితీవేత్తలను, సాహితీ మిత్రులను ఆహ్వానించడం జరుగుతుందన్నారు. గతంలో అనేక సామాజిక రుగ్మతలపై మన కవులు బాపిరాజు, గురజాడ, శ్రీ శ్రీ వంటి వారు అనేక రచనలు చేశారని గుర్తు చేశారు. ఈ సాహిత్య సమ్మేళనంలో పాల్గొనే వారు ఎటువంటి రుసుము చెల్లించనక్కర్లేదని, వారికి ఉచిత వసతి భోజన సదుపాయం సమకూర్చడం జరుగుతుందన్నారు. ఈ రెండు రోజుల సాహిత్య సమ్మేళనంలో కవిత్వ నిర్మాణం- వస్తు, శిల్పాలు, వర్తమాన సాహిత్యం -వివిధ వాదాలు, సాహిత్య చరిత్ర -వివిధ దృక్పదాలు,ప్రపంచీకరణ- ప్రతిఘటనా సాహిత్యం, తెలుగు కథ- సామాజిక చింతన, కథా రచన- మెలకువలు, కవులు రచయితలు- అధ్యయనం ఆవశ్యకత, ప్రసిద్ధ సాహితీవేత్తలతో యువకవులు, రచయితల ప్రశ్నోత్తరాలు, సృజన కారుల స్వరం, మేమెందుకు రాస్తున్నాం అనే అంశాలు ఉంటాయన్నారు. ఈ రెండు రోజుల సాహిత్య సమ్మేళనంలో తెలకపల్లి రవి, రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, కెంగార మోహన్, ఖాదర్ మొహియుద్దీన్, జంధ్యాల రఘుబాబు, అట్టాడ అప్పలనాయుడు, మహమ్మద్ ఖాదిర్ బాబు తదితరులు పాల్గొంటారని, అలాగే వక్తలుగా గంటేడ గౌరు నాయుడు, ఎంవిఎస్ శర్మ, పిన్నమనేని మురళి కృష్ణ, కే సత్య రంజన్ పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమాలకు సమన్వయకర్తలుగా తెలకపల్లి రవి, సత్యాజి, డాక్టర్ ఎం ప్రగతి, శాంతి శ్రీ ఉషారాణి



వ్యవహరిస్తారన్నారు. ఈ సదస్సును పురస్కరించుకొని పాల్గొనే వారి రచనలనుంచి కథ, కవిత వ్యాసం సమగ్ర సంకలనం వెలువరించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో అనకాపల్లి పుస్తక మహోత్సవ కమిటీ కన్వీనర్ బొప్పే ఉమామహేశ్వరరావు, అమరావతి బాలోత్సవ కమిటీ బాధ్యులు ఐజాక్ న్యూటన్, ఎంబీవీకే సామాజిక మాధ్యమ బాధ్యులు శోభన్ కుమార్ పాల్గొన్నారు.

# దక్షిణ ఎనర్జీ పరిశ్రమ లో ప్రమాదం పై యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి – సి ఐ టి యు డిమాండ్




జిల్లా లోని పరవాడ ఇండస్ట్రియల్ జోన్ లో మంగళవారం తెల్లవారు జామున దక్షిణ ఎనర్జీ పరిశ్రమ అగ్నిప్రమాదం ఘటన పై యాజమాన్యం పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సి ఐ టి యు జిల్లా అధ్యక్షు, ప్రధాన కార్యదర్శులు వివి శ్రీనివాసరావు, ఆర్ శంకర్రావు లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాజమాన్యం నిన్న ఉదయం 9 గంటలకు డ్యూటీ కు వచ్చిన కార్మికులను సుమారు 24 పని చేయించడం, కార్మికులను తీవ్ర పని ఒత్తిడి గురిచేయడం వల్లనే ప్రమాదం జరిగిందని, వారు మృత్యువాత పడ్డారని అన్నారు. ఇటువంటి చర్యలకు యాజమాన్యం పాల్పడుతున్న కార్మికశాఖ , ఫ్యాక్టరీస్ ఇన్స్పెక్టర్ తనిఖీలు లేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని అన్నారు. మృతి చెందిన కార్మికులకు కోటి రూపాయలు చొప్పున పరిహారం చెల్లించాలనీ కోరారు. ఉదయం ఐదున్నర గంటలకు పరవాడ ఫార్మాసిటీని ఆనుకొని ఉన్న ఇండస్ట్రియల్ పార్కులో వ్యర్థ ప్లాస్టిక్ తో తయారవుతున్న ఆయిల్ పరిశ్రమ దక్షణ ఎనర్జీ లో అగ్ని ప్రమాదం జరిగి అనకాపల్లి జిల్లా గోవాడ కు చెందిన వేపాడ వెంకటేష్ (34), త్రినాథ్ (24) మృతి చెందారు. ఈ ప్రాంత పరిశ్రమలో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాంత ఫ్యాక్టరీల పై పర్యవేక్షణ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయనీ, రాష్ట్ర ప్రభుత్వం వందలాది కంపెనీలు వచ్చి లక్షల ఉపాధి కల్పిస్తున్నామని ఆర్భాట ప్రచారాలు నిర్వహిస్తున్నాయి కార్మికులు భద్రత కు తీసుకోవాల్సిన చర్యలు మాత్రం చేపట్టడం లేదనీ అన్నారు. పారిశ్రామిక అధిపతులకు కొమ్ముకాస్తూ పరిశ్రమల భద్రతని గాలికి వదిలేసారు. అనకాపల్లి జిల్లాని పారిశ్రామిక ప్రాంతంలో కంపెనీలు భద్రతను తనిఖీ చేసే యంత్రాంగాన్ని గాలికి వదిలేసింది. తక్షణమే మృతు ల కుటుంబానికి కోటి చొప్పున నష్ట పరిహారం ఇవ్వాలని, గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని, కంపెనీ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని. సిఐటియు డిమాండ్ చేస్తున్నదన్నారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
25 గురువారం జూన్ 2026

## మాదక ద్రవ్యాలు పై ప్రజలకు అవగాహన...






కశింకోట మండలం వెదురుపర్తి గ్రామంలో పరదేశమ్మ తల్లి జాతర సందర్భంగా మాదకద్రవ్యాల దుర్వినియోగం, సైబర్ నేరాలు, మహిళల భద్రత మరియు మహిళలపై జరిగే నేరాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రజలకు మాదకద్రవ్యాల వల్ల వ్యక్తిగతంగా, కుటుంబపరంగా మరియు సమాజపరంగా కలిగే దుష్పరిణామాల గురించి వివరించడం జరిగింది. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పదంగా మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగం గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించడం జరిగింది. అలాగే సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలు మరియు పోలీసు సేవల గురించి అవగాహన కల్పించారు. గ్రామ ప్రజలు పోలీసులతో సహకరించి నేర రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరడం జరిగింది.



దేవాదాయ ధర్మాదాయ శాఖ శ్రీ సుభద్ర బలభద్ర జగన్నాథ స్వామి దేవస్థానంలో వచ్చేనెల 16న జగన్నాథ స్వామి నవరాత్రులు మహోత్సవ సందర్భముగా మంగళవారం గూడ్స్ రోడ్డు వద్ద ఉన్న ఇంద్రజమున హాల్ ఉత్సవాలుకు శుభ్రం చేస్తున్న దేవస్థానం చైర్మన్ దాడి బుజ్జి, ఓకే చంద్ర తేజ, శానిటేషన్ ఇన్స్పెక్టర్ అప్పారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వి.ఎం.ఆర్.డి.ఏ రీజనల్ లో ప్రజా దర్బార్ పాల్గొన్న....

### రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ





స్థానిక రావు గోపాలరావు కళాక్షేత్రంలోని వి.ఎం.ఆర్.డి.ఏ రీజనల్ కార్యాలయం లో ప్రజా దర్బార్ కార్యక్రమంలో వి ఎం ఆర్ డి ఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ తో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ శాసనసభ్యులు, అనకాపల్లి నియోజవర్గం టిడిపి ఇంచార్జ్ పీలా గోవింద సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిస్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని అన్నారు. అనంతరం కోట్లాది రూపాయిలతో మరమ్మాత్తులు చేస్తున్న రావు గోపాలరావు కళాక్షేత్రంలోని నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర , 80వ వార్డు టీడీపీ ఇంచార్జి బిఎస్ఎన్కే జోగి నాయుడు , తదితరులు, అధికారులు పాల్గొన్నారు.

## ఫార్మా సిటీ అగ్ని ప్రమాద ఘటనపై కొణతాల రామకృష్ణ విచారణ



జిల్లా లో పరవాడలోని ఫార్మా సిటీలో ఉన్న దక్షిణ్ ఎనర్జీ సంస్థలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనపై మాజీ మంత్రివర్యులు, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందడం పట్ల ఆయన ప్రగాఢ సంతాపం తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని సంబంధిత అధికారులను మరియు బాధిత కుటుంబాలకు ప్రభుత్వం మరియు అధికారులు అన్ని విధాలుగా అండగా నిలవాలని కోరారు. ఈ విషాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీ అరికట్టాలి...

## బి ఎస్ పి నేత సూదికొండ మాణిక్యాలరావు





విద్యా సంవత్సరం ప్రారంభం అయిన సందర్భంగా ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టే చర్యలు చేపట్టాలని బహుజన సమాజ్ పార్టీ అనకాపల్లి జిల్లా ఇంచార్జ్ సూదికొండ మాణిక్యాలరావు ప్రభుత్వనికి విజ్ఞప్తి చేశారు అనకాపల్లి మండల విద్యాశాఖ అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బి.ఎస్.కె విశ్వేశ్వరరావును అనకాపల్లి గవరపాలెం నందు గల అనకాపల్లి మండల విద్యాశాఖ కార్యాలయంలో ఈరోజు కలిసి ఆయనకు భారతరత్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాన్ని బహుకరించారు అనంతరం ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టాలని అందుకు తగిన చర్యలు చేపట్టాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు అనంతరం మాణిక్యాలరావు మాట్లాడుతూ ప్రైవేట్ విద్యా సంస్థలలో చదివిస్తే తమ పిల్లల భవిష్యత్తు బాగుంటుందని పేద మధ్య తరగతి తల్లిదండ్రుల అపోహ ను నమ్మకాన్ని అవకాశంగా తీసుకొని ప్రైవేటు విద్యాసంస్థలు వారిని దోపిడీకి గురి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రుల నుండి వేలాది రూపాయలు ఫీజుల రూపంలో వసూలు చేస్తున్నాయని ఆయన అన్నారు పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులు ఆయా పాఠశాలల్లోనే పుస్తకములు కొనుగోలు చేయాలని పట్టుబడుతూ పుస్తకాల రూపంలో కూడా వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఆయన విమర్శించారు

ప్రైవేటు పాఠశాలలో ఏ తరగతికి ఎంత ఫీజు వసూలు చేయాలనే పట్టికలను ఏర్పాటు చేయాలని అదేవిధంగా పుస్తకములు ఖరీదు కూడా బోర్డులలో అందరికీ తెలిసే విధంగా ఏర్పాటు చేయాలని ఆ విధంగా ప్రైవేటువిద్యా సంస్థల యాజమాన్యాలను ప్రభుత్వం ఆదేశించాలని ఆయన కోరారు అనకాపల్లి మరియు మండలం పరిధిలోని ప్రైవేటు విద్యాసంస్థలలో విద్యార్థిని విద్యార్థులకు కావలసిన సదుపాయాలన్నీ ఉన్నాయా లేదా అనే విషయం మీద అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆయన అన్నారు

విద్యార్థిని విద్యార్థులను ఆయా పాఠశాలల నుండి ఇంటికి ఇంటి నుండి పాఠశాలకు తీసుకుని వెళ్లే వాహనాలు పూర్తిస్థాయి సామర్థ్యం కలిగి ఉన్నాయా లేదా ఏమైనా మరమ్మతులకి గురై ఉన్నాయా అనే విషయం మీద దృష్టి సారించాలని లేకుంటే భవిష్యత్తులో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు ప్రైవేటు విద్యా సంస్థల మీద నిరంతరం అధికారుల పర్యవేక్షణ చేయాలని తద్వారా విద్యార్థుల కు వారి తల్లిదండ్రులకు భరోసా కల్పించినట్టు అవుతుందని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ వినతి పత్రం సమర్పించారు

# డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు



భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, గొప్ప జాతీయవాది డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా పుష్పాంజలి కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ ఆదేశాల మేరకు, అనకాపల్లి జిల్లా బీజేపీ అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లా పార్టీ ప్రధాన కార్యాలయంలో డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ద్వారపురెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ, దేశ సమైక్యత, జాతీయత కోసం డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. భారతదేశ సమగ్రత కోసం ఆయన చేసిన త్యాగాలు నేటి తరానికి ఆదర్శమని అన్నారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డెడ నాగేశ్వరరావు మాట్లాడుతూ, డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. దేశభక్తి, జాతీయత విలువలను సమాజంలో విస్తరింపజేయడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని పేర్కొన్నారు. అదే విధంగా బీజేపీ సీనియర్ నాయకులు, శ్రీ రాధా కృష్ణ దేవస్థానం వ్యవస్థాపక అధ్యక్షులు, గౌరీ గ్రంథాలయం ఉపాధ్యక్షులు, మాజీ బిఎస్ఎన్ఎల్ టాక్ సభ్యులు దాడి వీరునాయుడు ఆధ్వర్యంలో బి ఎల్ 2 పరిధిలో గవరపాలెం మహిళా కళాశాల, దాడి బోగలింగం జీవీఎంసీ పాఠశాల, అనకాపల్లి మండలం మారేడుపూడి గ్రామంతో పాటు తుమ్మపాల, కొండకొప్పాక తదితర ప్రాంతాల్లో ప్రత్యేక పుష్పాంజలి కార్యక్రమాలు నిర్వహించి డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దాడి వీరునాయుడు మాట్లాడుతూ, భారతదేశ ఏకత్వం, సమగ్రత కోసం డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగాలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశభక్తి, జాతీయత విలువలను సమాజంలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో యల్లపు ఎస్. నాయుడు, పొలిమేర మోహన్ రావు, పెంటకోట తులసి, కర్రి అప్పలనాయుడు, కొణతాల పరమేశ్వరి, పీలా ఉమామహేశ్వరరావు, సరిస కిరణ్, దార్ల వెంకట రమణమూర్తి, కొయ్యి శ్రీను తదితరులతో పాటు బీజేపీ సీనియర్ నాయకులు అడ్వకేట్ నానాజీ పాల్గొని డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు అర్పించారు.

# రాష్ట్ర భవిష్యత్తు నిర్మాతలు విద్యార్థులే శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ





రాష్ట్ర భవిష్యత్తును నిర్మించే శక్తి విద్యార్థులలోనే ఉందని మాజీ మంత్రివర్యులు, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రివర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యా వ్యవస్థలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికారని ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దేందుకు ఆధునిక మౌలిక వసతులు, నాణ్యమైన బోధన, విద్యార్థి కేంద్రిత సంస్కరణలను అమలు చేయడం వల్ల ప్రభుత్వ విద్యపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగిందని తెలిపారు.

ఈ మార్పులకు నిదర్శనంగా అనకాపల్లి నియోజకవర్గం, అనకాపల్లి మండలం మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఈ విద్యా సంవత్సరంలో సరికొత్త రికార్డు సృష్టించిందన్నారు. పాఠశాలలో ఏకంగా 133 మంది విద్యార్థులు కొత్తగా చేరడం విశేషమని, అందులో 57 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలో చేరడం ప్రభుత్వ విద్యా వ్యవస్థపై పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు.

గత విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో పాఠశాల సాధించిన అద్భుతమైన ఉత్తీర్ణత శాతం, విద్యార్థుల ప్రతిభ, ఉపాధ్యాయుల అంకితభావం, పాఠశాలలో నెలకొన్న మెరుగైన విద్యా వాతావరణం కారణంగానే ఈ స్థాయిలో చేరికలు నమోదయ్యాయని తెలిపారు.

కొత్తగా చేరిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికి, వారి విద్యాభ్యాసం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసి ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పెరుగుతున్న విద్యార్థుల చేరికలు విద్యా రంగంలో చోటుచేసుకుంటున్న సానుకూల మార్పులకు నిదర్శనమని, భవిష్యత్ తరాలకు ఉత్తమ విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు.

# పరవాడ ఫార్మాసిటీలో అగ్నిప్రమాద ఘటనపై అనకాపల్లి ఎంపీ దిగ్భ్రాంతి

### – క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి..

### క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించిన....

### రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సిఎం రమేష్



జిల్లాలోని పరవాడ ఫార్మాసిటీలోని దక్షిణ్ ఎనర్జీ సంస్థలో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.ఎం. రమేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందడం అత్యంత బాధాకరమని మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రమాద ఘటనకు సంబంధించిన వివరాలను జిల్లా అధికారుల ద్వారా తెలుసుకుని సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని అధికారులను కోరారు. క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించి అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించి జిల్లా అధికారులతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను మరింత కట్టుదిట్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని, అవసరమైన సహాయ చర్యలు చేపట్టేందుకు సంబంధిత అధికారులతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER · తెలుగు దిన పత్రిక · hyderabadestate.co.in
25 గురువారం జూన్ 2026

# ఒక యూట్యూబర్ తీసిన సినిమాకు భారత్‌లో వసూళ్ల వర్షం!

హాలీవుడ్‌లో ఓ చిన్న హారర్ సినిమా బాక్సాఫీస్ వద్ద పెను సంచలనం సృష్టిస్తోంది. 26 ఏళ్ల కర్రీ బార్కర్ దర్శకత్వం వహించిన 'అబ్సెషన్' చిత్రం భారత్‌లో ఊహించని విజయాన్ని అందుకుంది. ఈ సినిమా ఇప్పటివరకు మన దేశంలో రూ.79 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, 2026లో అతిపెద్ద హాలీవుడ్ హిట్‌గా నిలిచింది.

కేవలం రూ.7.5 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా, భారీ అంచనాలతో విడుదలైన 'ప్రాజెక్ట్ హెయిల్ మేరీ' (రూ.75 కోట్లు) వసూళ్లను అధిగమించడం విశేషం. భారత్‌లో అత్యధిక వసూళు సాధించిన హాలీవుడ్ చిత్రాల జాబితాలో 'అబ్సెషన్' ప్రస్తుతం 28వ స్థానంలో ఉంది. మరో కోటి రూపాయలు వసూలు చేస్తే 'అవెంజర్స్: ఏజ్ ఆఫ్ అల్ట్రాన్' (రూ.80 కోట్లు) రికార్డును కూడా దాటేస్తుంది. ఒకప్పుడు యూట్యూబర్‌గా ఉండి, దర్శకుడిగా మారిన 26 ఏళ్ల కర్రీ బార్కర్ ఈ విజయంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ముఖ్యంగా భారత్‌లో తన సినిమాకు ఈ స్థాయిలో ఆదరణ లభిస్తుందని తాను ఊహించలేదని అన్నారు. ప్రేక్షకులు సినిమాలోని సన్నివేశాలను రీక్రియేట్ చేస్తూ కామెడీ వీడియోలు చేయడం, ఫ్యాన్ ఆర్ట్ గీయడం వంటివి చూసి షాక్‌కు గురయ్యానని తెలిపారు. ఈ విజయం అల్గారిథమ్‌ల కంటే ఫిలిం మేకర్స్‌పై నమ్మకం పెంచడానికి దోహదపడుతుందని ఆశిస్తున్నట్లు బార్కర్ పేర్కొన్నారు. యువ దర్శకులు మంచి కాంట్రాక్టులు, క్రియేటివ్ కంట్రోల్ సాధించుకోవాలని సూచించారు. కాగా, ఈ చిత్రం



ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే 334 మిలియన్ డాలర్లకు పైగా వసూలు చేసి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది.

# 'పుత్రోత్సాహం' అంటే ఇదే.. తండ్రిగా గర్వపడుతున్నా

## : రామ్ చరణ్‌పై చిరంజీవి భావోద్వేగ ట్వీట్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన కుమారుడు రామ్ చరణ్‌ను 'న్యూ ఏజ్ మెగాస్టార్' అని సంబోధించడంపై మెగాస్టార్ చిరంజీవి ఆనందంతో ఉప్పొంగిపోయారు. ఒక తండ్రిగా గర్వపడుతున్నానంటూ సోషల్ మీడియా వేదికగా తన సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా సుమతీ శతకంలోని ఓ పద్యాన్ని ఆయన ఉటంకించారు. 'పుత్రోత్సాహము తండ్రికి పుత్రుడు జన్మించినపుడే పుట్టదు, జనులా పుత్రుని గనుగొని పొగడగా, పుత్రోత్సాహంబు నాడు పొందుర సుమతీ' అనే పద్యాన్ని పోస్ట్ చేస్తూ.. కొడుకు పుట్టినప్పుడు కాకుండా, అతని గొప్పతనాన్ని చూసి ప్రజలు మెచ్చుకున్నప్పుడే తండ్రికి నిజమైన ఆనందం కలుగుతుందని చిరంజీవి పేర్కొన్నారు. ఇటీవలే 'పెద్ది' సినిమాతో భారీ విజయాన్ని అందుకున్న రామ్ చరణ్, రిపబ్లిక్ టీవీ నిర్వహించిన ఒక ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో గెస్ట్‌గా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాని మోదీ, రామ్ చరణ్‌ను ప్రశంసించారు. ప్రధాని పాల్గొన్న వేదికపై చరణ్‌కు దక్కిన గౌరవం చూస్తుంటే తండ్రిగా గర్వంగా ఉందని చిరంజీవి తన పోస్ట్‌లో తెలిపారు. తన కృషి, అంకితభావంతో చరణ్ దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకోవడం సంతోషంగా ఉందన్నారు. రామ్ చరణ్ మరిన్ని ఉన్నత శిఖరాలను



అధిరోహించి, తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు 'ఎక్స్' వేదికగా రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది.

# నెట్టింట హీట్ పెంచుతున్న దివి.. స్టన్నింగ్ లుక్స్

సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్ గా ఉండే బిగ్ బాస్ ఫేమ్ దివి వాద్యా లేటెస్ట్ గా ఇన్ స్టాగ్రామ్ లో ఒక వీడియో షేర్ చేసింది. అందులో ఆమె గ్లామర్ డోస్ కాస్త పెంచినట్లు క్లియర్ గా తెలుస్తోంది. ఒక అందమైన సెటప్ లో క్రీమ్ కలర్ డిజైనర్ టాప్, దానికి సెట్ అయ్యేలా స్కర్ట్ ధరించి కెమెరాకు ఇచ్చిన పోజులు కుర్రకారును ఆకట్టుకుంటున్నాయి. లైట్ మేకప్ తో చాలా న్యాచురల్ గా కనిపిస్తూనే తనలోని గ్లామరస్ యాంగిల్ ను హైలెట్ చేసింది.

జబ్ తుమ్ సాత్ హో అనే క్యాప్షన్ తో పోస్ట్ చేసిన ఈ వీడియోలో దివి ఎక్స్ ప్రెషన్స్ కు ఫాలోవర్స్ ఫిదా అవుతున్నారు. ఈ అవుట్ ఫిట్ లో ఆమె లుక్ మరింత ఎలివేట్ అయింది. ఒకపక్క ట్రెడిషనల్ టచ్ ఇస్తూనే మరోపక్క మోడ్రన్ గ్లామర్ ను బ్యాలెన్స్ చేస్తూ ఇచ్చిన స్టిల్స్ నెటిజన్లను ఎట్రాక్ట్ చేస్తున్నాయి. మరీ ఓవర్ గా కాకుండా చాలా డీసెంట్ గా తన గ్లామర్ ను ప్రెజెంట్ చేసిన విధానం ఫాలోవర్స్ కు బాగా నచ్చుతోంది. దివి కెరీర్ గురించి మాట్లాడుకుంటే బిగ్ బాస్ షో ఆమెకు ఎంత క్రేజ్ తెచ్చిందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఆ రియాలిటీ షోలో పెద్దగా హడావిడి చేయకుండా సైలెంట్ గా ఉంటూనే తనకంటూ ఒక సపరేట్ ఫ్యాన్ బేస్ క్రియేట్ చేసుకుంది. అప్పటివరకు మోడలింగ్ లో ఉన్న దివికి బిగ్ బాస్ హౌస్ నుంచి బయటకు వచ్చాక ఇండస్ట్రీలో మంచి అవకాశాలే దక్కాయి. మంచి హైట్, స్క్రీన్ ప్రెజెన్స్ తో పాటు యాక్టింగ్ స్కిల్స్ కూడా ఉండటంతో ఫిల్మ్ మేకర్స్ ఆమెకు ఆఫర్స్ ఇస్తూ వచ్చారు.





సినిమాలతో పాటు ఓటీటీ ప్రాజెక్ట్స్ లో కూడా దివి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. కొన్ని వెబ్ సిరీస్ లలో ముఖ్య పాత్రలు పోషించి నటిగా తనను తాను ప్రూవ్ చేసుకునే ప్రయత్నం చేస్తోంది. టాలీవుడ్ లో ఒక మంచి పొజిషన్ లో సెటిల్ అవ్వాలనే టార్గెట్ తో అడుగులు వేస్తున్న ఈ బ్యూటీ కంటెంట్ ఉన్న కథలను ఎంచుకుంటూ ముందుకెళ్తోంది. ఇక పెద్ద సినిమాల్లో క్యారెక్టర్ రోల్స్ వచ్చినా వాటిని వదులుకోకుండా తన మార్క్ చూపించే ప్రయత్నం చేస్తోంది. ఇండస్ట్రీలో ఎప్పుడూ వార్తల్లో ఉండాలంటే యాక్టింగ్ తో పాటు గ్లామర్ మెయింటైన్ చేయడం కూడా చాలా అవసరం. బహుశా అందుకే దివి ఇలాంటి ఫోటోషూట్స్ తో మేకర్స్ దృష్టిని ఆకర్షించే ప్లాన్ లో ఉన్నట్లు అనిపిస్తుంది. సరైన బ్రేక్ వస్తే కమర్షియల్ సినిమాల్లో కూడా గ్లామర్ రోల్స్ చేయడానికి తను రెడీ అనే సిగ్నల్స్ ఈ వీడియో ద్వారా పంపుతోందని ఆడియన్స్ కామెంట్స్ చేస్తున్నారు. చూడాలి మరి ఈ గ్లామర్ షో ఆమె కెరీర్ కు ఫ్యూచర్ లో ఎంతవరకు ప్లస్ అవుతుందో.

# 'వారణాసి' సెట్స్ పై ఎంఎంఏ ఫైటర్ తో రాజమౌళి.. ఎవరీ యోగేశ్ జాదవ్?



దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబినేషన్ లో వస్తున్న వరల్డ్ అడ్వెంచర్ యాక్షన్ మూవీ వారణాసి. తాజాగా ఈ సినిమా గురించి మరో ఆసక్తికరమైన అప్‌డేట్ బయటకు వచ్చింది. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా సెట్స్ నుంచి కొన్ని ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ ఫొటోలలో రాజమౌళి పక్కన 6.5 అడుగులకు పైగా ఎత్తుతో ఉన్న ఓ భారీ కాయుడు కనిపించడం అందరిలోనూ ఆసక్తి రేకెత్తిస్తోంది. అతడి కంటే ఎత్తుగా కనిపించేందుకు సరదగా రాజమౌళి కుర్చీ ఎక్కి నిలబడడం ఈ ఫొటోల్లో చూడొచ్చు. ఇంతకీ ఆ ఫొటోల్లో జక్కన్నతో ఉన్న వ్యక్తి మరెవరో కాదు, భారత్‌కు చెందిన ప్రొఫెషనల్ ఎంఎంఏ (మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్) ఫైటర్ యోగేశ్ జాదవ్. క్రీడా వర్గాల్లో 'ది జెంటిల్ జెయింట్'గా పేరుపొందిన యోగేశ్, బిగ్ బాస్ మరాఠీ వంటి రియాలిటీ షోల ద్వారా కూడా సుపరిచితుడే. మహేశ్ బాబుతో తెరకెక్కిస్తున్న ఈ భారీ యాక్షన్-అడ్వెంచర్ చిత్రంలో కీలకమైన యాక్షన్ సన్నివేశాల కోసం రాజమౌళి అతడిని ఎంపిక చేసినట్టు తెలుస్తోంది.

'వారణాసి' సినిమా కోసం కాశీ నగరాన్ని తలపించేలా భారీ సెట్స్‌ను నిర్మించారు. ఈ సెట్స్‌లోనే రాజమౌళి, యోగేశ్ జాదవ్‌తో చర్చిస్తున్న ఫొటోలు ఇప్పుడు వైరల్ అయ్యాయి. సినిమాలో అత్యంత శక్తివంతమైన, హై-ఆక్టేన్ ఫైట్ సన్నివేశాలను డిజైన్ చేయడంలో యోగేశ్ పాలుపంచుకుంటున్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని 2027 ఏప్రిల్ నాటికి ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకుంది.

# 'మేమిద్దరం ప్రైవేటుగా మాట్లాడుకున్నాం'.. సీఎం విజయ్ బర్త్‌డే విషెస్ వివాదంపై రజనీ క్లారిటీ!



సూపర్‌స్టార్ రజనీకాంత్, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మధ్య సంబంధాలపై కొంతకాలంగా జరుగుతున్న చర్చకు తాజాగా ఆయన స్వయంగా తెరదించారు. విజయ్ పుట్టినరోజున బహిరంగంగా శుభాకాంక్షలు చెప్పకపోవడంపై సోషల్ మీడియాలో వచ్చిన విమర్శలకు రజనీ క్లారిటీ ఇచ్చారు. తామిద్దరం వ్యక్తిగతంగా మాట్లాడుకున్నామని, అనవసరమైన ఊహాగానాలకు తావులేదని స్పష్టం చేశారు. ఇవాళ తన తదుపరి చిత్రం 'ధర్మన్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో రజనీకాంత్ పాల్గొన్నారు. ఈవెంట్ ముగిశాక ఆయన వెళ్తుండగా, మీడియా ప్రతినిధులు సీఎం విజయ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. దీనికి రజనీ స్పందిస్తూ.. 'మేమిద్దరం అప్పుడే మాట్లాడుకున్నాం' అని తమిళంలో క్లుప్తంగా సమాధానమిచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో ఈ వివాదానికి ఆయన ముగింపు పలికినట్లయింది.

నిన్న తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తన 52వ పుట్టినరోజు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కమల్ హాసన్, మోహన్‌లాల్, కీర్తి సురేష్, ఖుష్బూ సుందర్, త్రిష వంటి రాజకీయ, సినీ రంగాలకు చెందిన అనేక మంది ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అయితే, రజనీకాంత్ నుంచి ఎలాంటి బహిరంగ ప్రకటన రాకపోవడంతో ఆయన అభిమానులు, నెటిజన్ల మధ్య తీవ్ర చర్చ జరిగింది. నిజానికి రజనీకాంత్ ఇలాంటి విమర్శలను ఎదుర్కోవడం ఇదే మొదటిసారి కాదు. ఈ ఏడాది మొదట్లో విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ ఎన్నికల్లో ఘన విజయం సాధించి, ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సమయంలోనూ రజనీ మౌనంపై ప్రశ్నలు తలెత్తాయి. వాస్తవానికి ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే విజయ్‌కు అభినందనలు తెలిపిన మొదటి వ్యక్తులలో రజనీ ఒకరు. అయినప్పటికీ బహిరంగంగా స్పందించకపోవడం చర్చనీయాంశమైంది. ఇటీవలి కాలంలో తమిళనాట రజనీకాంత్, విజయ్ మధ్య పోలికలు పెరిగాయి. రజనీ రాజకీయ ప్రవేశంపై వెనక్కి తగ్గగా, విజయ్ మాత్రం అనూహ్యంగా రాజకీయాల్లోకి వచ్చి ముఖ్యమంత్రి అయ్యారు. ఈ నేపథ్యంలో రజనీకాంత్ తీసుకునే ప్రతి నిర్ణయం, ఆయన మౌనం కూడా విజయ్‌తో ముడిపెట్టి విశ్లేషణలకు దారితీస్తోంది.





